క్లుప్తంగా

రవీంద్రారెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్‌): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన కర్నూలు జిల్లా కోర్టు వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తున్నారని, ఆయన ఆశయ సాధన కోసం వెన్నపూసను గెలిపించాలని విన్నవించారు.

మందుబాబులకు జైలు, జరిమానా



డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులతో ట్రాఫిక్‌ పోలీసులు

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకన్‌ డ్రైవ్‌లో దొరికిన మందుబాబులకు స్పెషల్‌ జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ సెకండ్‌ క్లాస్‌ కోర్టు న్యాయమూర్తి జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్‌ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్‌ దగ్గర డ్రంకన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించారు. దీంతో మద్యం సేవించి అరుణ్‌కుమార్‌, మద్దిలేటి, సలీం రాజు, ఖాజా మియ, సుంకన్న, సురేష్‌, మురళీకృష్ణ, అన్వర్‌, షరీఫ్‌, మహేంద్ర, మధుశేఖర్‌, శాలి మియ్య, రాకేష్‌, మధు, జయరాముడు, రాజశేఖర్‌ తదితరులు పట్టుబడ్డారు. వీరిలో పది మందికి మూడు రోజులు జైలు, రూ. వెయ్యి జరిమానా, మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరొకరికి ఒక రోజు జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

లోక్‌ అదాలత్‌తో సత్వర న్యాయం



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు (న్యూటౌన్‌) : లోక్‌ అదాలత్‌తో పేదలకు సత్వర న్యాయం చేకూరుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్‌. వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గార్గేయపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని, నందికొట్కూరు రోడ్డులో ఉన్న సాయి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలు వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. హాస్టల్‌లో న్యాయపరమైన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తామన్నారు. అనంతరం సాయి వృద్ధాశ్రమానికి వెళ్లి వైఎస్సార్‌ పింఛన్‌ కానుక అందుతుందా, న్యాయపరమైన సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్‌ కేంద్రం తనిఖీ

సి.బెళగల్‌: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక జిల్లా పరిషత్‌ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్‌ శివశంకర్‌నాయక్‌, ఎంపీడీఓ రాముడు, ఎస్‌ఐ పీరయ్య తనిఖీ చేశారు. అక్కడ కల్పించాల్సిన ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

● గూడూరు:ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్‌ శివరాముడు తెలిపారు. మండలంలో 1202 మంది పట్టభద్రులు,41మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. వీరి కోసం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్‌ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు.

వందశాతం రాయితీపై సూక్ష్మపోషకాలు

సి.బెళగల్‌: జింక్‌, జిప్సం తదితర సూక్ష్మ పోషకాలను వందశాతం రాయితీపై అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ పరికరాలు, యంత్రాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. అసవరమైన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలన్నారు.

కొనుగోలుదారుల చూపు.. ఈఎంఐల వైపు

● వాయిదాల పద్ధతిలోనేలోనే ఇంటి సామగ్రి కొనుగోలుకు జనం ఆసక్తి

● స్వల్ప, జీరో శాతం వడ్డీకి రుణాన్ని ఇస్తున్న బ్యాంకులు, ఫైనాన్స్‌ సంస్థలు

కర్నూలు(సెంట్రల్‌): కర్నూలులోని బుధవార పేటకు చెందిన రాము, శేఖర్‌ స్నేహితులు. ఇద్దరు ఒక్కటే ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరికి వచ్చే జీతం పదివేల లోపే. ఎన్నో ఏళ్లుగా రాము ఇంట్లోకి ఫ్రిజ్‌, కూలర్‌ తీసుకెళ్లాలని ఆశపడుతున్నాడు. అయితే అరకొర జీతంతో అది సాధ్యపడడంలేదు. శేఖర్‌ ఇంట్లో మాత్రం ఆ రెండు వస్తువులతోపాటు వాషింగ్‌ మిషన్‌ అదనంగా ఉంది. ఒకరోజు శేఖర్‌ ఇంటికి వెళ్లిన రాము ఫ్రిజ్‌, కూలర్‌, వాషింగ్‌ మిషన్‌ ఎలా సమకూర్చుకున్నావని అడిగాడు. అందుకు శేఖర్‌ ఈజీలీ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్‌(ఈఎంఐ) గురించి చెప్పాడు. అనుకున్నదే తడవుగా శేఖర్‌ ఇంట్లోకి రూ.30 వేల విలువ చేసే ఫ్రిజ్‌, కూలర్‌ వచ్చేశాయి. ఇలా ఒక్క రాముడే కాదు..వందల సంఖ్యలో ప్రజలు గృహోపకరణాలను (ఈఎంఐ) కంతుల పద్ధతిలో కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

వాయిదాల పద్ధతిలో రూ.కోట్లలో వ్యాపారం :

ఐదారేళ్ల క్రితం ఈఎంఐలో వస్తువులు తీసుకోవాలంటే బ్యాంకులు, ఫైనాన్స్‌ సంస్థలు డ్యాకుమెంట్‌ చార్జీలు, 8 శాతం వరకు వడ్డీతోపాటు సెక్యూరిటీని అడిగేవి. అయితే ప్రస్తుతం జీరో శాతం లేదా అతి స్వల్ప వడ్డీకే రుణాలను సమకూర్చుతున్నాయి. కొన్ని సంస్థలు సెక్యూరిటీ లేకుండా కూడా రుణాన్ని ఇస్తుండగా, కొన్ని మాత్రం మూడు, నాలుగు చెక్‌లను తీసుకుంటున్నాయి. ఏ వస్తువును కొనుగోలు చేయాలన్నా ముందుగా దాని రేటును 12 భాగాలు విభజించి నాలుగు కంతులు కట్టాలి. మిగిలిన 8 భాగాలను వాయిదాల రూపంలో నెలనెలా కట్టుకోవాలి. పండుగలు, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఎలాంటి ముందుస్తు రుణం లేకుండానే 12 భాగాలు నెలనెలా కట్టుకునే విధంగా ఆఫర్లను ప్రకటిస్తుండటం విశేషం. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు, చిరుద్యోగులతోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు కూడా ఈఎంఐలోనే సామగ్రి కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారాలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్నూలు, ఆదోని, నంద్యాల, బనగానపల్లె, ఆత్మకూరు, నందికొట్కూరు, ఎమ్మిగనూరు తదితర పట్టణాల్లో రోజులో కోట్లాది రూపాయల వ్యాపారం వాయిదాల పద్ధతిలో జరుగుతోంది.



ఓ దుకాణంలో గృహోపకరణాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి....

వాయిదాల పద్ధతిలో వస్తువులు ఇస్తున్నారని ఎక్కువగా కొనుగోలు చేస్తే ఇబ్బందికర పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అనాలోచితంగా కొనుగోలు చేస్తే అప్పులపాలవుతారని హెచ్చరిస్తున్నారు. సరైన ప్రణాళిక, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ తమ స్థాయికి తగ్గట్టు వస్తువులు, అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు..

ఈఎంఐలోనే విక్రయాలు ఎక్కువ



ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారాలు సగానికి పైగా ఈఎంఐ పద్ధతిలోనే ఉంటున్నాయి. నాలుగు కంతులు కడితే ఫైనాన్స్‌ కంపెనీలు మిగతా రుణాన్ని చెల్లిస్తున్నాయి. దీంతో నెలనెలా చాలా మంది ఏదో ఒక వస్తువును కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారాలు కూడా బాగానే ఉంటున్నాయి.

– ఖలీల్‌బాషా, ఖలీల్‌ ఎలక్ట్రానిక్స్‌, కర్నూలు

ఆల్బెండజోల్‌ మాత్రల పంపిణీ

గూడూరు: ఈ నెల 14న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్‌ మాత్రలను పంపిణీ చేయాలని ఎంఈఓ సునీలమ్మ హెచ్‌ఎంలకు సూచించారు. శుక్రవారం వైకేపీ సమావేశ హాలులో వైద్య సిబ్బంది, హెచ్‌ఎంలతో ఎంఈఓ సమావేశమయ్యారు. వైద్య సిబ్బంది సహకారంతో అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు.

వందశాతం పంపిణీ చేయాలి

పాణ్యం: ఆల్బెండజోల్‌ మాత్రల పంపిణీని వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ దస్తగిరి సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో డాక్టర్‌ భగవాన్‌దాస్‌తో కలిసి హెచ్‌ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈనెల 14న ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు.

పైర్లను కాపాడాలి

గూడూరు: పైర్లు ఎండిపోతున్నాయని, ఒక్క తడికి సాగు నీరు ఇప్పించి కాపాడాలని గూడూరు, మల్లాపురం, మునుగాల, గుడిపాడు, ప్యాలకుర్తి తదితర గ్రామాల రైతులు ఎల్‌ఎల్‌సీ అధికారులతో మొరపెట్టుకున్నారు. శుక్రవారం రైతులు మండల కేంద్రానికి చేరుకుని ఎల్‌ఎల్‌సీ సెక్షన్‌ ఏఈ లక్ష్మన్నను కలిసి తమ సమస్యను విన్నవించారు. స్పందించిన ఏఈ వెంటనే డీఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఇరిగేషన్‌ ఎస్‌ఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లి సాగు నీరు అందిస్తామని డీఈఈ హామీ ఇచ్చినట్లు ఆయన రైతులకు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● మేడ్‌ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్యలక్ష్మి



మేడ్‌ రాష్ట్ర నేతలను సన్మానిస్తున్న జిల్లా నేతలు

కర్నూలు(అర్బన్‌): సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మోడల్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ దళిత్‌ ఎంప్లాయీస్‌ (మేడ్‌) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మ అధ్యక్షతన శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌ భవన్‌లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. సమాజంలో ఇంకా వివిధ రూపాల్లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా ప్రతి మహిళ తన చిన్నారులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. అలాగే మేడ్‌ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మను నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ సంక్షేమాధికారిణులు డీపీ సులోచన, రజనీ, మేడ్‌ నంద్యాల కార్యదర్శి ప్రమీల, చాంద్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ షబానా తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి ఆశయాలను కొనసాగిద్దాం



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళి అర్పిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్‌): ఆధునిక భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లోని పూలే దంపతుల విగ్రహాలను బీసీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తకోట మోహన్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ..సావిత్రీబాయి పూలే అందించిన సేవలను కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమె వర్ధంతిని అధికారికంగా నిర్వ హించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ, నాయకులు కనికె శివరామ్‌, బాలసంజన్న, బీసీ ఉద్యోగ సంఘం నాయకులు హరికృష్ణగౌడ్‌, హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు, అన్వర్‌హుసేన్‌ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం



యోగా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఈఓ రమణ

కర్నూలు (టౌన్‌): ఆధునిక జీవితంలో యోగా సాధన తప్పనిసరిగా మారిందని, యోగాతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా క్రీడా శాఖ సీఈఓ రమణ అన్నారు. శుక్రవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బాలికలకు జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని యోగా క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవాది శ్రీధర్‌ రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై రాణించి పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం జిల్లాలో యోగాలో విశేషంగా కృషి చేసిన క్రీడాకారులు ప్రసన్న, అక్షర సుప్రియలను సన్మానించారు. కార్యక్రమంలో యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్‌ శెట్టి, చీఫ్‌కోచ్‌ నటరాజరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

కోడుమూరు రూరల్‌: భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్‌ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశంలో పశుసంవర్ధక శాఖ ఏడీఏ రామసుబ్బారెడ్డితో కలిసి ఏఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పత్తి సాగు వల్ల నష్టం తప్ప లాభం లేదన్నారు. బోరుబావులున్న రైతులు వేసవిలో కూరగాయలు, నూనెగింజ పంటలను సాగు చేసుకోవాలన్నారు. రబీలో శనగ సాగు చేసిన రైతులు పంట దిగుబడులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. సమావేశంలో ఏఈఓ తస్లీమ్‌ పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

● డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రామగిడ్డయ్య



నులిపురుగు మాత్రల కిట్లను అందిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కల్లూరు: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ జీవీ రమణమూర్తిలకు నులిపురుగుల నివారణ మాత్రల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూల కార్యక్రమాన్ని ఈ నెల 14 ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, కళాశాలల్లో ప్రారంభించి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారన్నారు. ఫలితంగా పిల్లగ్లా శారీరక, మానసిక ఎదుగుదల మందగిస్తుందన్నారు. కార్యక్రమంలో కల్లూరు, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు మోతిలాల్‌ నాయక్‌, సీహెచ్‌వో సురేష్‌ బాబు, ఈఓఆర్డీ రవికిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

శనగలు కొనుగోలు చేస్తాం

కల్లూరు: రైతులు పండించిన శనగ పంటను ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తా మని జిల్లా సమీకృత కేంద్ర ప్రాజెక్టు డైరెక్టర్‌ శ్రీలత అన్నారు. శుక్రవారం కల్లూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌ సీజన్‌లో పత్తి పంటలో హైడెన్సిటీ ప్లాంటేషన్‌ ప్రోగ్రామ్‌(హెచ్‌డీపీపీ) పద్ధతిలో సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ విధానంలో సాగు చేయడం వల్ల పతి పంటలో చీడ, పీడలు, తెగులు ప్రభావం తక్కువగా ఉండడంతో పాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. సమావేశంలో డీఆర్‌సీ వ్యవసాయ అధికారులు మాధురి, హేమలత, పట్టుపరిశ్రమ అధికారి మాసుం వలి, పశువైద్యుడు శ్రీకాంత్‌ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, ఉద్యా న శాఖ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభ పెడితే చట్టపరమైన చర్యలు

కర్నూలు (టౌన్‌): శాసన మండలి ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని, వారిని ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు ఎన్నికల నిర్వహణ అధికారి, నగర పాలక కమిషనర్‌ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌ శాసన మండలి కౌన్సిల్‌ యాక్ట్‌ 2005 ప్రకారం ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పోలింగ్‌ జరిగే 48 గంటల ముందు సమయంలో బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదన్నారు. అలాగే పోలింగ్‌ స్టేషన్లకు ఓటర్లను చేరవేయడం, రవాణా సౌకర్యం, ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టడం నిషేధించినట్లు తెలిపారు. మద్యం సరఫరా కానీ, ఎలాంటి సామగ్రి, డబ్బు పంపిణీ చేయకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరు సహకరించాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కర్నూలు సిటీ: స్థానిక ఏ క్యాంపులోని మదర్‌ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో శుక్రవారం వీర్కొ బయోటెక్‌ సంస్థ వారు నిర్వహించిన జాబ్‌ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాకు 400 మంది విద్యార్థులకుపైగా హాజరు కాగా...ఇందులో మదర్‌ థెరిస్సా ఫార్మసీ కాలేజీకి చెందిన 40 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాలేజీ అకాడమిక్‌ డైరెక్టర్‌ డా.ఆదిమూలపు సతీష్‌ తెలిపారు. కార్యక్రమంలో మైపర్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ డా.జె.రవి కుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్‌ ఆఫీసర్‌ డా.కె సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళా ఇంజినీరింగ్‌ కాలేజీలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒమేగా హాస్పిటల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ బి.రవీంద్రబాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కువగా రొమ్ము, సర్వికల్‌, నోటి క్యాన్సర్లు వస్తున్నాయన్నారు. జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్‌ డా.కె.ఇ శ్రీనివాసరావు, వైస్‌ ప్రిన్సిపాల్‌ ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించండి

కర్నూలు(సెంట్రల్‌): కర్నూలులో నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకోసం మునిసిపల్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్‌ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అధికారుల నిర్లక్ష్యంతో రెండు రోజులుగా కర్నూలు నగరంలో నీళ్లు లేక ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. అధికారులకు పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ ప్రజలకు కల్పించే అవసరాలపై లేదని ఆరోపించారు. కార్యక్రమంలో టి.రాముడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కర్నూలు సిటీ: ప్రస్తుత కాలంలో గుండె సంబంధిత మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, కావున ప్రతి ఒక్కరూ సీపీఆర్‌ (కార్డియో పల్మనరీ రెస్యూసిటేషన్‌)పై అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్శిటీ రెక్టార్‌ ఆచార్య డా.సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్‌ సుందరానంద పుచ్చాలు అన్నారు. శుక్రవారం వర్సిటీలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సందర్భాల్లో ఆగిన గుండెకు సీపీఆర్‌ చేస్తే తిరిగి గుండె పని చేసే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్‌ ప్రథమ చికిత్సపై టెక్నీషియన్‌ ఈ.సుధాకర్‌ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల 108 మేనేజర్లు ఎం.నవీన్‌, జి.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌ స్టేషన్ల తుది జాబితా ఖరారు

కర్నూలు (టౌన్‌): కర్నూలు నగరపాలక సంస్థలో త్వరలో 42వ వార్డుకు నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌ స్టేషన్ల తుది జాబితాను ఖరారు చేసినట్లు నగరపాలక కమిషనర్‌ భార్గవ తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు పరిధిలోని కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్‌ ప్రాథమిక పాఠశాల (42/1, 42/2, 42/3, 42/4, 42/5 వరకు), అలాగే కట్టమంచి రామలింగారెడ్డి ఉన్నత పాఠశాలలో బి–సెక్షన్‌ (అబ్బాయిలు 42/6), క్లాస్‌–5 (అమ్మాయిలు, 42/7)లలో పోలింగ్‌ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్‌ వెల్లడించారు. మొత్తం 8,394 ఓటర్లు ఈ వార్డులో ఉన్నట్లు ఆయన తెలిపారు.

సీఎం జగన్‌తోనే కర్నూలుకు న్యాయం

● మండలి ఎన్నికల్లో న్యాయవాదులు అండగా ఉండాలి

● కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌



వెన్నపూస రవీంద్రారెడ్డికే ఓటు వేయాలని న్యాయవాదులను కోరుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌

కర్నూలు(రాజ్‌విహార్‌): సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే కర్నూలు జిల్లాకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్‌ ఖాన్‌ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, బార్‌ కౌన్సిల్‌ సభ్యులను కలిసి పట్టభద్రుల మండలి ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో పెద్దలు చేసుకున్న శ్రీబాగ్‌ ఒప్పందాన్ని అమలు చేయకపోవడంతో కర్నూలుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అయితే జిల్లాకు న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్‌ హైకోర్టు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. దీంతో దశాబ్దాల కల నెరవేరుతుందని, జిల్లాతోపాటు న్యాయవాదులకు మంచి రోజులు వస్తాయన్నారు. లా నేస్తం ద్వారా వేల మంది న్యాయవాదులకు ఆర్థిక సహాయం చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సీఎం ఆశయ సాధన కోసం పని చేసే అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఈనెల 13 తేదీన జరిగే మండలి ఎన్నికల్లో ఓటేయాలని అభ్యర్థించారు. పాలన మరింత మెరుగ్గా ఉండాలంటే మండలిలోనూ పూర్తి మెజారిటీ ఉండాల్సిన అవసరం ఉందని, అందుకు న్యాయవాదులు అండగా ఉండాలని విన్నవించారు. అనంతరం కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కత్ర హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూస రవీంద్రారెడ్డికే వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఉన్నత విద్యను అభ్యసించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్‌ సతీమణి స్వర్ణలత, సీఈఓ రమణ

కర్నూలు(టౌన్‌): ప్రతి మహిళ ఉన్నత విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్‌ సతీమణి స్వర్ణలత పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌ నుంచి రాజ్‌విహార్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్‌ సతీమణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని చెప్పారు. ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని, ఆడ, మగ అన్న తేడా లేకుండా పిల్లలిద్దరినీ సమానంగా పెంచాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ మాట్లాడుతూ.. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు మహిళలకు క్రీడాపోటీలతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగశివలీల, డీఎస్పీ మహబూబ్‌ బాషా, సత్యనారాయణ, వ్యాయామ అధ్యాపకులు, ఎస్వీఆర్‌, మెప్మా, మున్సిపల్‌ కార్పొరేషన్‌, డీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు మృతిపై ఆందోళన



మృతి చెందిన శిశువుతో కుటుంబ సభ్యుల ధర్నా

కర్నూలు(హాస్పిటల్‌): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శిశువు మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. వారు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నగరంలోని పాతబస్తీకి చెందిన సుజాత గురువారం మధ్యాహ్నం మొదటి కాన్పు కోసం ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో చేరింది. అయితే ఆమెకు ఉమ్మనీరు తక్కువగా ఉండటంతో వైద్యులు సిజేరియన్‌ ద్వారా ప్రసవం చేశారు. అనారోగ్యంగా ఉన్న శిశువును వెంటనే చిన్నపిల్లల విభాగంలోని ఎస్‌ఐసీయూకు తరలించారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం సదరు శిశువు మృతి చెందిందని వైద్య సిబ్బంది చెప్పడంతో కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టినప్పుడు బిడ్డ బాగానే ఉందని, ఎస్‌ఐసీయూలో సక్రమంగా వైద్యం చేయకపోవడంతో శిశువు మృతి చెందిందని పేర్కొంటూ ప్రసూతి విభాగంతో పాటు ఎన్‌టీఆర్‌ సర్కిల్‌లో ధర్నా, రస్తారోకో చేశారు. ఉమ్మనీరు బాగా తక్కువగా ఉండటం, పుట్టుకతో మరికొన్ని ఆరోగ్య సమస్యలు ఉండటంతోనే శిశువు మరణించిందని వైద్యులు వివరణ ఇచ్చారు.

ఓటీ సొమ్ము చెల్లించాలని నిరసన

కర్నూలు(రాజ్‌విహార్‌): ప్రజా రవాణ శాఖ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. శుక్రవారం స్థానిక కర్నూలు–2 డిపో, ఆర్‌ఎం కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలతో తమ ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్‌ యూనియన్‌ కర్నూలు–2 డిపో కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఓటీ సొమ్ము చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రబ్బాని, ఆర్‌వీఎం రావు, చంద్ర, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం..

కర్నూలు(సెంట్రల్‌): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఏపీజేఏసీ అమరావతి పిలుపు మేరకు శుక్రవారం రెండోరోజు ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి కేవై కృష్ణ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు నాగరమణయ్య, నాగేశ్వరరరావు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

కోడుమూరు రూరల్‌: ఉపాధి కూలీలు నిర్ణయించిన ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకటగిరి, ఎర్రదొడ్డి, అనుగొండ గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ తనిఖీ చేసి ఉపాధి సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రతి రోజూ ఉదయం 7 గంటలకల్లా పనుల్లోకి వెళ్లి మధ్యాహ్నంలోగా ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.250ల వరకు వేతనం పడుతుందన్నారు. ఆయన వెంట ఏపీఓ రమాదేవి ఉన్నారు.